సత్తా చాటాలి.. పతకం తేవాలి

ఎన్టీఆర్ స్టేడియంలో జర్మన్ షెపర్డ్ జాతి పోలీసు జాగిలాలు ప్రత్యేక శిక్షణ పొందుతున్నాయి. 24-36 నెలలున్న ఇవి.. ఈనెల 13, 14 తేదీల్లో దిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నాయి. పతకం సాధించేలా తర్ఫీదు ఇస్తున్నట్లు శిక్షకులు ప్రశాంత్, సంతోష్ తెలిపారు.

డబ్బు.. డబ్బు.. డబ్బు..

- అనుబంధాల్ని మరిపించిన పైసా
- పెళ్లి ఖర్చులు తిరిగివ్వాలని అన్నావదిన ఒత్తిడి..
- తమ్ముడి ఆత్మహత్య

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: తన పెళ్లికి పెట్టిన ఖర్చులు తిరిగివ్వాలని అన్నా వదినలు పెడుతున్న వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన చందానగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై సరితారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి తారానగర్ ప్రాంతానికి చెందిన శరత్‌చారి(23) బంగారం పని చేసే తన అన్న కృష్ణాచారి దగ్గర పనిచేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన చందన శ్రీని శరత్ వివాహం చేసుకున్నాడు. కృష్ణాచారి ఖర్చులు భరించి వివాహం జరిపించాడు. అయితే ఇటీవల అన్న కృష్ణాచారి, వదిన ప్రమీల పెళ్లికి చేసిన ఖర్చు డబ్బులు మొత్తం తిరిగి ఇవ్వాలని తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. శరత్‌చారి తన దగ్గరున్న బంగారం అన్నావదినలకు ఇచ్చాడు. మిగిలిన మొత్తం ఇవ్వాలని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో శరత్‌చారి మరో ఉద్యోగం చూసుకున్నాక తీసుకొస్తానని భార్యను పుట్టింటికి పంపాడు. అయినా ఆగని కృష్ణాచారి దంపతులు మిగిలిన డబ్బుల కోసం శరత్‌చారితోపాటు అతని భార్యకు ఫోన్ చేసి ఇష్టానుసారంగా మాట్లాడారు. డబ్బులు ఇవ్వాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గురువారం శరత్‌చారి గుర్తుతెలియని విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శరత్‌చారి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బల్దియా పనులంటే పరార్

- బిల్లులు రాక గుత్తేదారుల విముఖత

గాజులరామారం రోడామిస్త్రీ నగర్‌లో పైపులైను వేసి రోడ్డు వేయకుండా ఇలా వదిలేశారు

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: రాజధానిలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. రూ.వందల కోట్ల విలువైన రోడ్లు, ఇతరత్రా పనులకు టెండర్లు పిలిస్తే ఒక్కదానికీ గుత్తేదారులు ముందుకు రావడం లేదు. 6 నెలల్లో 300 పనులకు టెండర్లను పిలిస్తే 50 పనులే చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత 100 పనులకు టెండర్లు పిలిస్తే కేవలం 3, 4 పనులకే టెండర్లు వచ్చాయి. కొన్నింటినికి రెండోసారి టెండర్లు పిల్చినా స్పందన లేదు. దీనింతటికీ కారణం గుత్తేదారులకు సకాలంలో బల్దియా బిల్లులు చెల్లించపోవడమే. ఇప్పుడు పని పూర్తి చేస్తే ఏడాదిన్నర తరువాత బిల్లులు మంజూరైతే పనులను ఎలా చేయాలని గుత్తేదారులు ప్రశ్నిస్తున్నారు.

మహానగరంలో ఏటా దాదాపు రూ.600 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకు కాలనీల్లో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, ఇతర నిర్వహణ పనులను బల్దియా చేపడుతోంది. నగరంలో దాదాపు 2 వేల మంది వరకు చిన్నా పెద్దా గుత్తేదారులున్నారు. మూడేళ్ల కిందట టెండర్లు పిలిస్తే గుత్తేదారులు పోటీలు పడి మరీ అంచనా వ్యయం కంటే తక్కువకు దాఖలు చేసి పనులను చేజిక్కించుకుని పూర్తి చేసేవారు. అయితే రెండేళ్లగా బల్దియా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. గుత్తేదారులు పనులాపేసి బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తేగానీ బిల్లులు చెల్లించలేదు. ఆరు నెలల కిందట అలా ధర్నా చేస్తే రూ. 300 కోట్ల వరకు చెల్లించారు. ఇప్పుడు మళ్లీ మొదటికొచ్చిందంటున్నారు. ప్రస్తుతం దాదాపు రూ.800 కోట్ల వరకు బకాయిలున్నాయని తెలిసింది. దీంతో బల్దియా ఇంజినీరింగ్ విభాగం చేపట్టే పనులు తీసుకోవడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఫలితంగా కొన్నేళ్లగా కాలనీల్లో రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో నడవడానికి వీలులేకుండా మారిపోయాయి. కొన్నిచోట్ల నాలాలు కూలిపోతే వాటిని కూడా మరమ్మతులు చేసే పరిస్థితులు కన్పించడం లేదు.

అధికారులపై తీవ్ర ఒత్తిడి

కాలనీల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. నడక సరే. . పెద్దపెద్ద గోతులతో వాహనాలు పాడవుతున్నాయి. దీంతో అటు కాలనీ వాసుల నుంచి, ఇటు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి బల్దియాకు ఒత్తిడి వస్తోంది. దీంతో ఏంచేయాలో పాలుపోక అయోమయ పరిస్థితిని ఎదుర్కొవాల్సి వస్తోందని ఇంజినీరు ఒకరు తెలిపారు. గుత్తేదారుల సంఘాన్ని కదిలిస్తే.. '2022లో చేపట్టిన కొన్ని పనులకూ బిల్లులు రాలేదు. చాలామంది ముందుగా పెట్టుబడి పెట్టి పని చేసి అప్పులు భరించలేక ఆస్తులమ్ముకున్నారు. మూడు నెలలకోసారి రూ.200 కోట్ల బకాయిలను విడుదల చేయమని అధికారులకు చెప్తూనే ఉన్నాం. కానీ స్పందన లేదు. అందుకే టెండర్లలో పాల్గొనడం లేదు' అన్నారు.

మహిళా సాధికారతలో ముందంజ

- దేశ వ్యాప్త సర్వేలో నగరానికి ఐదో స్థానం
- టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇండియా అధ్యయనంలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్న మొదటి ఐదు నగరాల్లో హైదరాబాద్‌కు ఐదో స్థానం లభించింది. చెన్నై మొదటి స్థానంలో నిలవగా.. బెంగళూరు, పుణె, ముంబయి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అవతార్ గ్రూపు ఇండియా 'టాప్ సిటీస్ ఫర్ ఉమెన్' నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. దేశ ఆర్థిక వృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న 113 నగరాలను ఎంపిక చేసి పది లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు (49), పది లక్షల కంటే తక్కువగా ఉన్న నగరాలు (64)గా విభజించి సర్వే నిర్వహించింది. గతేడాది జులై నుంచి డిసెంబరు వరకు దేశవ్యాప్తంగా 1200 మహిళలను భాగస్వామ్యం చేస్తూ వివరాలను రాబట్టింది. సిటీ ఇంక్లూజన్ స్కోర్ (సీఐఎస్), ఇండస్ట్రియల్ ఇంక్లూజన్ స్కోర్ (ఐఐఎస్), సిటిజన్ ఎక్స్‌పీరియన్స్ స్కోర్ (సీఈఎస్)లో అంశాల ఆధారంగా టాప్- 5 నగరాల జాబితాను సిద్ధం చేసింది. దీని కోసం పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్), జాతీయ జనాభా గణన, నేరాల రికార్డులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి పొందిన డేటా ఆధారంగా తుది నివేదికను రూపొందించింది.

బంధం చెల్లిపోయింది

- చిన్నారిని బలిగొన్న బడి బస్సు
- అన్నయ్యను పంపించడానికి తండ్రితో వచ్చి వాహనం ఢీకొని మృతి

తండ్రితో చిన్నారి

లాలాపేట, హబ్సిగూడ, న్యూస్‌టుడే: ఉదయం బడికి వెళ్లే అన్నను బస్సు ఎక్కించడానికి వెళ్లకపోయి ఉంటే బాగుండేది. కానీ క్షణాల్లో అన్నతో బంధం 'చెల్లిపోయింది. అప్పటివరకు బడికి వెళ్లడానికి సిద్ధమవుతున్న అన్నయ్యతో కబుర్లు చెప్పుకుంది. బస్సెక్కించడానికి తండ్రితో వెళ్తున్న సోదరుడి వెంట నడిచి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. ఈ విషాదకర ఘటన ఓయూ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేరళకు చెందిన మిథున్ హబ్సిగూడలో ఆరేళ్లుగా ఉంటున్నాడు. భార్యాభర్తలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరికి కుమారుడు, కుమార్తె. కుమారుడు స్థానికంగా జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. కుమార్తె జెవల్ అన్నాకు ఇంకా రెండేళ్లు కూడా నిండలేదు. ఆ చిన్నారిని చూసుకోవడానికి ఓ మహిళను కేర్‌టేకర్‌గా పెట్టుకున్నారు. దంపతులిద్దరూ ఉదయం విధులకు వెళ్లే ముందు ఆమెకు అప్పగించి వెళ్తారు. గురువారం ఉదయం తండ్రి మిథున్ కుమారుడిని స్కూల్‌కు పంపించడానికి బస్ వద్దకు వచ్చాడు. అతని వెనకాలే కుమార్తె కూడా వచ్చి బస్ ముందువైపు చివరి భాగంలో నిలబడింది. కుమారుడిని బస్సెక్కించి రేపు ఊరెళ్తున్నామని, మీరు రావొద్దని డ్రైవర్‌కు చెప్పి పక్కకు జరిగాడు. అదే సమయంలో వాహనం ముందుకు కదలడంతో చిన్నారి బస్సు టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు.

జీహెచ్ఎంసీలో మళ్లీ ప్రజావాణి

- ఈనెల 8న సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో
- సంక్రాంతి తర్వాత కేంద్ర కార్యాలయంలో..

ఈనాడు, హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇకపై ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరగనుంది. చాలారోజుల కిందట నిలిచిపోయిన 'ప్రజావాణి' సేవలను పునఃప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సర్కిల్, జోనల్ కార్యాలయాలతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. బల్దియాతో ముడిపడిన సమస్యలను ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఫిర్యాదులు, సమస్యలను అప్పటికప్పుడు నమోదు చేసుకుంటామని, వాటిని సంబంధిత అధికారులకు చేరవేసి పరిష్కారానికి చర్యలు తీసుకునే విధానం అమల్లోకి రాబోతోందన్నారు. సంక్రాంతి తర్వాత ఈనెల 22న కేంద్ర కార్యాలయంలోనూ ప్రజావాణి ప్రారంభమవుతుందని చెప్పారు. కేంద్ర కార్యాలయంలో మాత్రం ఫోన్-ఇన్ చేపట్టాలని నిర్ణయించారు. అందుకు ప్రత్యేక ఫోన్ నంబరును ప్రకటిస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనుంది.

త్వరలో మౌలాలి - హైటెక్‌సిటీ ఎంఎంటీఎస్‌లు

ఈనాడు, హైదరాబాద్: ఎంఎంటీఎస్ రెండో దశ పనుల్లో భాగంగా మౌలాలి - సనత్‌నగర్ మధ్య నిర్మిస్తున్న రెండో లైను పనులు పూర్తయ్యాయి. దీంతో మౌలాలి నుంచి నేరుగా హైటెక్‌సిటీ మీదుగా లింగంపల్లికి ఎంఎంటీఎస్ రైళ్లు నడిపేందుకు అవకాశం లభించనుంది. ఫిబ్రవరిలోపే ఈ మార్గంలో ఎంఎంటీఎస్‌లు పట్టాలెక్కనున్నాయని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఈ సేవలు అందుబాటులోకి వస్తే మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు హైటెక్‌సిటీ వైపు ప్రయాణ కష్టాలు తీరుతాయి.

అదనంగా ఆరు స్టేషన్లు

మౌలాలి - సనత్‌నగర్ మధ్య మొత్తం 22 కిలోమీటర్ల పరిధిలో 6 స్టేషన్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. వారందరికీ రూ.5 టికెట్‌తో వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. ఇప్పుడు వీరంతా కేవలం 30 నిమిషాల్లో ఐటీ సంస్థలు ఉండే ప్రాంతాలకు చేరే అవకాశం ఉంటుంది. మల్కాజిగిరి నియోజకవర్గంలో 25 వేల నుంచి 30 వేల మంది ఐటీ ఉద్యోగులు నివాసం ఉంటున్నట్టు కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీటీ శ్రీనివాస్ చెప్పారు.

సొంత ఇంటి నుంచే కార్యాలయాలకు..

సనత్‌నగర్, పీర్జాదిగూడ, సుచిత్ర సెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్, హౌసింగ్‌బోర్డు కాలనీ(ఇంకా నిర్మాణం పూర్తి కాలేదు), మౌలాలి స్టేషన్ల నుంచి ఎంఎంటీఎస్ పరుగులు పెట్టనున్నాయి. ప్రస్తుతం అక్కడివారు ఐటీ కారిడార్‌కు రావాలంటే నేరేడ్‌మెట్, ఆర్‌కేపురం వంతెన, కంటోన్మెంట్, బేగంపేట మీదుగా సొంత వాహనాల్లో నానా అవస్థలు పడేవారు.

ఆధార్‌కేదీ గ్యారంటీ?

కేంద్రాల వద్ద అప్‌డేట్‌కు బారులు

మూసారాంబాగ్ మెట్రోస్టేషన్‌లోని కేంద్రంలో రద్దీ

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, అమీర్‌పేట్, సైదాబాద్

ఆరు గ్యారంటీలకు ఆధార్ అప్‌డేట్ తప్పులు తప్పడం లేదు. పథకాల అమలుకు దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఫొటో, చిరునామాలో మార్పులు, గ్యాస్ కేవైసీ, బాల ఆధార్ తదితరాల కోసం కేంద్రాల వద్ద జనాలు బారులు తీరుతున్నారు. ఉదయం 5 గంటలకే చేరుకొని టోకెన్ల కోసం పడిగాపులు పడుతున్నారు. పదోతరగతి పూర్తయిన వారికి ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అంటూ కాలేజీల్లో చెబుతుండటంతో వారూ క్యూ కడుతున్న క్రమంలో రద్దీ పెరిగిపోతోంది. కొన్నిచోట్ల ఆన్‌లైన్ స్లాట్లను ఇప్పిస్తామంటూ డబ్బులు దండుకుంటున్న దాఖలాలూ ఉన్నాయి.

'తెలంగాణ' అని లేకపోవడంతో...

ఆరు గ్యారంటీలకు ఒక్కో కేంద్రంలో రోజూ వందల మంది దరఖాస్తు చేస్తున్నారు. తప్పనిసరిగా ఆధార్ ప్రతి సమర్పించాలన్న నిబంధనతో అప్‌డేట్ చేయించుకోవడానికి పరుగులు పెడుతున్నారు. పదేళ్లగా అప్‌డేట్ చేసుకోకపోవడం, చిరునామాలో చాలామందికి తెలంగాణ బదులు ఆంధ్రప్రదేశ్ అని ఉండటంతో అనేక చోట్ల దరఖాస్తులు స్వీకరించడం లేదు. పైగా ఆర్టీసీ బస్సుల్లోనూ ఆంధ్రప్రదేశ్ అని ఉంటే టిక్కెట్టు తీసుకోవాలని చెబుతుండటంతో మార్పు కోసం ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

సామర్థ్యం 1000.. వస్తోంది 1500

ముసారాంబాగ్ మెట్రోస్టేషన్‌లోని కేంద్రంలో 16 ఆధార్ కౌంటర్లున్నాయి. 1000 మందికి పైగా సేవలు అందించే సామర్థ్యం ఉన్నప్పటికీ 1500 కంటే ఎక్కువ మంది వస్తున్నారు. 800 ఆఫ్‌లైన్ టోకెన్లు, 200 ఆన్‌లైన్‌స్లాట్‌ల ద్వారా అర్జీలు స్వీకరిస్తుండటంతో మరో 500 మంది వెనుదిరుగుతున్నారు. మేడ్చల్, మహేశ్వరం వారు ఉదయం ఎప్పుడో వస్తే.. రాత్రి వరకు తమ నంబరు రావడం లేదని వాపోతున్నారు.

- అమీర్‌పేట్ స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో ఆధార్ ప్రాంతీయ కార్యాలయం ఉంది. 500 మందికి సేవలందించే సామర్థ్యంతో ఈ కేంద్రం పనిచేస్తుండగా...నిత్యం 1000-1200 మంది వస్తున్నారు.

వారం రోజులుగా తిరుగుతున్నా

– త్యాగరాజు, మోతీనగర్

ఆధార్‌కార్డుపై చిరునామాలో ఆంధ్రప్రదేశ్ అని ఉంది. ప్రజాపాలన కేంద్రాల్లో అర్జీ తీసుకోవడం లేదు. రాష్ట్రం పేరు మార్పు కోసం వారం రోజులుగా తిరుగుతున్నా. ఉదయం వస్తేగానీ టోకెన్లు లభించని పరిస్థితి.

అక్షరదోషం సరిచేయించడానికి వచ్చా

– శ్యామ్‌కుమార్, కబీర్‌నగర్

పేరులో అక్షర దోషం సరి చేసుకోవడం కోసం తెల్లవారుజామున ఐదు గంటలకే మీ సేవాకేంద్రానికి వచ్చి క్యూలో ఉన్నా. పని పూర్తయ్యే వరకు అన్నపానీయాలు లేవు. తాగునీరు లేదు.

- రహదారుల కరకట్టల్లో వ్యర్థాలు వాడొచ్చన్న కేంద్రం
- చర్యలు ప్రారంభిస్తామంటున్న జీహెచ్ఎంసీ

చెత్త కరిగే మార్గం

ఈనాడు, హైదరాబాద్: జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు మంచి రోజులొచ్చాయి. చెత్త కుప్పలను రహదారుల నిర్మాణంలో ఉపయోగించొచ్చని తాజాగా కేంద్ర రహదారులు, రవాణాశాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. అంతే కాదు.. ప్రయోగాత్మకంగా దిల్లీ, అహ్మదాబాద్-దౌలేరా ఎక్స్‌ప్రెస్ వే కరకట్టల నిర్మాణంలో చెత్తను ఉపయోగించినట్లు మట్టితో నిర్మించినట్లుగానే రోడ్లు పటిష్టంగా ఉన్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో బల్దియా ఇంజినీర్లు వ్యర్థాల సమస్య పరిష్కారంపై కసరత్తు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హెచ్ఆర్‌డీసీఎల్ సంస్థల ఆధ్వర్యంలో నగరంలో పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణాలు సాగుతున్నాయి. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ సైతం వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ.. నిర్మాణ పనులను చేపడుతోంది. జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే.. ఆయా రోడ్డు పనులకు డంపింగ్ యార్డు వ్యర్థాలను వినియోగించొచ్చు. ఇంజినీర్లు ఆ విషయంపై ఇప్పటికే దృష్టిపెట్టారు. ప్రయత్నం ఫలిస్తే.. డంపింగ్ యార్డు చుట్టుపక్కలున్న 20 గ్రామాల ప్రజలకు దుర్వాసన, నీటి కాలుష్యం నుంచి విముక్తి లభిస్తుంది.

120 లక్షల మెట్రిక్ టన్నులు..

ప్రస్తుతం 8 వేల టన్నుల వ్యర్థాలు పుట్టుకొస్తున్నాయి. నిర్మాణ వ్యర్థాలు మరో 2 వేల టన్నులు. అంతా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చేరుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పదేళ్ల పాటు వ్యర్థాలను నిల్వ చేసుకునే స్థలాన్ని, 30 ఏళ్లపాటు వాడుకోవచ్చని జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం అంచనా వేస్తోంది. తద్వారా చెత్త నుంచి వెలువడే దుర్వాసన తగ్గుతుందని, కాలుష్యం నియంత్రణలో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

రోడ్లకు ఉపయోగిస్తే..

జవహర్ నగర్ డంపింగ్ యార్డులోని 120 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రీజనల్ రింగు రోడ్డు నిర్మాణం, శివారు ప్రాంతాల్లో చేపడుతోన్న లింకు రోడ్లకు, ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగించొచ్చు. అదే జరిగితే డంపింగ్ యార్డులో క్యాపింగ్ చేసిన చెత్త సగం ఖాళీ అవుతుంది. 100 ఎకరాల స్థలం అందుబాటులోకి వస్తుంది. రోడ్ల నిర్మాణంలో వ్యర్థాల వినియోగం ఊపందుకుంటే శివారుల్లో పోగవుతున్న చెత్తకు పరిష్కారం దొరికినట్లేనని భావిస్తున్నారు.

'పది' ఫెయిలైతే ఉపాధ్యాయులదే బాధ్యత: కలెక్టర్

విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఈనాడు, హైదరాబాద్: పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలైతే ఉపాధ్యాయులదే బాధ్యతని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థుల స్థితిగతులపై ఆయన కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతేడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించాలనే సంకల్పంతో కృషి చేయాలని, వందశాతం ఫలితాలకు కృషి చేద్దామన్నారు. 70రోజుల్లో పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు, మోడల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సర్కారు బడుల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. వెనకబడిన విద్యార్థులకు శిక్షణ ఇస్తే మెరుగయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఫెయిలైతే అది ఉపాధ్యాయుల లోపమేనన్నారు. శిష్యులు పరీక్షల్లో తప్పితే గురువుకు అవమానంగా భావించాలన్నారు. గతేడాది పదోతరగతి ఉత్తీర్ణత రాష్ట్రంలో 90శాతం ఉంటే... జిల్లా 80 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించిందని గుర్తు చేశారు.

గణితం.. సైన్స్‌లపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించే డిప్యూటీ ఈవోలు, డీఐవోలు వందశాతం కృషిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. జిల్లాలో విద్యార్థులు ఎక్కువగా గణితం, సైన్స్ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారని.. వారిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు స్లిప్ టెస్టులు, మార్క్ టెస్ట్‌లు పెట్టి వాటిపై పునశ్చరణ చేసినప్పుడు విద్యార్థులకు ఫైనల్ పరీక్షల భయం తొలగిపోతుందని వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్.రోహిణి, ఉప విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

ఓఆర్ఆర్ చుట్టూ.. లాజిస్టిక్ పార్కులు

- పీపీపీ పద్ధతిలో రూ.1620 కోట్లతో నిర్మాణానికి ప్రణాళిక
- ఇప్పటికే 2 ప్రాంతాలు ఎంపిక

బాటసింగారంలోని లాజిస్టిక్ పార్కు

ఈనాడు, హైదరాబాద్: అవుటర్ రింగ్‌రోడ్డు చుట్టూ ఏర్పాటు ఏర్పాటు చేయనున్న లాజిస్టిక్ పార్కుల విషయంలో హెచ్ఎండీఏ పునరాలోచనలో పడింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించదలచిన ఈ పార్కులకు రూ.1620 కోట్లవుతుందని అంచనా వేశారు. అధునాతన సదుపాయాలతో రెండు ప్రాంతాల్లో లాజిస్టిక్ పార్కులను నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. పటాన్‌చెరు మండల పరిధి లక్డారం, పటాన్‌చెరులో ఈ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేసి ఆసక్తి వ్యక్తీకరణకు టెండర్లు పిలిచింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) విధానంలో వీటిని నిర్మించేందుకు లక్డారంలో సర్వే.నం 738లో 101 ఎకరాలు, పటాన్‌చెరు సర్వే.నం 639లో 29 ఎకరాలు కేటాయించేందుకు భూసేకరణ, ప్రభుత్వ భూములు కేటాయించాలని నిర్ణయించారు. లక్డారం లాజిస్టిక్ పార్కుకు రూ.1300 కోట్లు, పటాన్‌చెరు పార్కుకు రూ.320 కోట్లు ఖర్చు అవుతుందనుకున్నారు. ప్రస్తుతం బాటాసింగారం, మంగళపల్లిలో 2 లాజిస్టిక్ పార్కులు ఉన్నాయి. ఇంకా 10 నిర్మించాలనుకుంటే భూమి, నిధుల సమస్య ఎదురవుతోంది.

నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో..

నగరం నలుదిశలా శరవేగంగా విస్తరిస్తున్న దశలో చుట్టూ లాజిస్టిక్ హబ్‌లు చాలా అవసరం. భారీ వాహనాలు, కంటైనర్లు నగరం లోపలకు రాకుండా లాజిస్టిక్ హబ్‌ల్లోనే సరకు దిగుమతులు, ఎగుమతులు చేయడం. . అక్కడ నుంచి నగరానికి తరలించడం సులువు. నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది. అవుటర్ చుట్టూ వీటి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. వీటిలో ఐల్యాండ్ కంటైనర్ డిపోలు, స్టేషన్లు, ఉచిత వేర్ హౌజ్ జోన్లు, ఫ్రైట్ విలేజ్‌లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, ఎయిర్ కార్గో కాంప్లెక్సులు, సరకు ఉత్పత్తి, ప్రాసెసింగ్.. ప్యాకింగ్ సౌకర్యాలు కల్పించనున్నారు. ట్రక్కు డ్రైవర్ల విశ్రాంతికి కాటేజీలు, రెస్టారెంట్లు, పెట్రోలు బంపులు, గ్యారేజీలు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులూ ఉంటాయి. కొత్త ప్రభుత్వంలో కూడా వీటిపై సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

ఈనాడు
దినపత్రికలో అన్నిరకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు 99635 22257
అమీర్‌పేట్ డివిజన్ 80085 97633
ఎల్.బి.నగర్ డివిజన్ 90000 15736
కూకట్‌పల్లి డివిజన్ 80085 15142
క్లాసిఫైడ్స్ యాడ్స్ కొరకు : 99080 16959
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008012478, 8008611167

(c) eenadu